# సభ్యత

ట్రింగ్ ట్రింగ్ మంటూ ఫోను మోగింది. రిసీవర్ని చేతిలోకి తీసుకుని "హలో" అన్నాను.

"ఓసారి నా ఛాంబర్‌కి రండి సారథిగారూ" అంటూ ఫోను పెట్టేశారు, మా మేనేజరుగారు.

ఏదో అర్జంటు పని వుంటుందనుకుని వెంటనే బయల్దేరి వెళ్ళాను. నన్ను చూడగానే అటెండరు తలుపుతీస్తూ "వెళ్ళండి సార్" అన్నాడు.

ఛాంబర్లోకి అడుగు పెడుతూనే

"గుడ్ మార్నింగ్ సర్" అన్నాను వినయపూర్వకంగా.

"గుడ్‌మార్నింగ్ సారథిగారూ. రండి కూచోండి" అన్నారు మేనేజరు ముకుందన్‌గారు.

"థాంక్స్ సర్" కూచుంటూనే అన్నాను.

"సారథిగారూ, ఇప్పుడు మిమ్మల్ని పిలవడానికి కారణం ఏమిటంటే" ఆగారాయన.

"చెప్పండి సర్"

"మా అబ్బాయి అరవింద్ చెన్నయ్‌లో చదువుకుంటున్నాడు, మా అమ్మా నాన్న దగ్గర. వాడిప్పుడు ఇంటరు చదువుతున్నాడు. ఈమధ్య చెన్నయ్‌లో జరిగిన జూనియర్ టేబిల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ గెల్చుకున్నాడట" ఆగారాయన.

"చాలా సంతోషం సర్. అబ్బాయికి నా అభినందనలు తెలియజెయ్యండి" అన్నాను సభ్యత కోసం.

"స్వయంగా వాడికి మీరు అభినందనలు చెబుదురుగాన్లెండి..ఇప్పుడో సమస్య ఎదురయ్యిందండీ" అన్నారు ముకుందన్‌గారు.

"ఏవిటా సమస్య సర్"

"మా అబ్బాయి ఆటని స్వయంగా చూడాలని వాళ్ళమ్మ, వాళ్ళక్క, మా బంధువులు, కొందరు మిత్రులు కోరుతున్నారు సారథిగారూ. మన కమ్యూనిటీ హాల్లో, మావాడితో మంచి టేబిల్ టెన్నిసు ప్లేయర్ని చూసి, ఒక మేచ్ ఆడించగలరా. ఇది నా రిక్వెస్టు సారథిగారూ" అన్నారు ముకుందన్‌గారు.

ఆయన అభ్యర్థన తీరుకి నేను ఆశ్చర్యపోయాను. ఎందుకూ అంటే, మా కమ్యూనిటీ సెంటర్‌కి ముకుందన్‌గారే అధ్యక్షులు. నేను ప్రస్తుత కార్యదర్శిని. అధికారాలన్నీ కలిగిన ముకుందన్‌గారు నన్ను రిక్వెస్టు చెయ్యడమేమిటి, ఆయన ఆజ్ఞాపించవచ్చు. ఆజ్ఞాపిస్తే, నేను కాదనలేను కదా. కానీ అది ఆయన పెద్దమనసుకి తార్కాణం. సభ్యతకు నిదర్శనం.

అధికారాన్ని దుర్వినియోగం చేసుకునేవారు ఎంతోమంది వున్న నేటి సమాజంలో ముకుందన్‌లాంటి వ్యక్తుల్ని ఎంతమందిని చూడగలం.

"నన్ను మీరు రిక్వెస్టు చెయ్యడం ఏమిటి సర్, అధ్యక్షులుగా ఆజ్ఞాపించండి" అన్నాను.

ముకుందన్‌గారు ముసి ముసిగా నవ్వేరు.

"అలా అనకండి సారథిగారూ! నాకు అధికారాలు వున్నా, ఈ విధంగా వాటిని దుర్వినియోగపర్చడం నాకు ఇష్టం లేదండీ. కార్యనిర్వాహకులు మీరు. అందుకే మిమ్మల్ని రిక్వెస్టు చేస్తున్నాను. ఈ ప్రత్యేకమైన ఏర్పాటుకయ్యే ఖర్చుల్ని నేనే భరిస్తాను" అన్నారాయన నవ్వుతూనే.

నాకు నవ్వొచ్చింది.

"మంచివారే సర్! కమ్యూనిటీ సెంటర్ తరపున ఏర్పాటయిన ఇటువంటి కార్యక్రమాలకి అయ్యేఖర్చు, భరించడానికి కార్యనిర్వాహకునిగా నాకు అధికారం



వుంది. ఆ ఏర్పాటంతా నేను చూసుకుంటాను. రాబోతున్న ఆదివారం ఈ 'మేచ్'ని సాయంత్రం ఏడు గంటలకి ఏర్పాటుచేస్తాను సర్. మన కమ్యూనిటీ సెంటర్ టేబిల్ టెన్నిస్ ఛాంపియన్ రాంబాబు మనకి అందుబాటులో వున్నాడు సర్. అతనితో మీ అబ్బాయి ఆడతాడు" అన్నాడు.

ముకుందన్‌గారి మొహం విప్పారింది.

"థాంక్స్ సారథిగారూ! వస్తోన్న ఆదివారం సాయంత్రం ఆరున్నరకి మేమంతా హాల్లో వుంటాం" అన్నారాయన.

"అలాగే సర్! మరి నేను వస్తాను సర్" అంటూ నిష్క్రమించాను. 'అధికారం చేతిలో వున్నవాళ్ళంతా ముకుందన్‌గారిలా ప్రవర్తిస్తే ఎంత బావుణ్ను!' అనుకున్నాను మనసులో.

కమ్యూనిటీ సెంటర్ సెక్రటరీగా నాకున్న అధికార పరిధి మేరకు, అనుకున్నట్టే ఆదివారం సాయంత్రం ఏడుగంటలకి టేబిల్ టెన్నిసు ఎగ్జిబిషన్ మేచ్ ఏర్పాటు చేశాను.

మేనేజరుగారి కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు, స్నేహితులే గాకుండా మరెంతోమంది ఆ మేచ్‌ని తిలకించడానికి వచ్చారు.

మేనేజరు ముకుందన్‌గారబ్బాయి అరవింద్, కమ్యూనిటీ సెంటర్ ఛాంపియన్ రాంబాబుల మధ్య ఉత్కంఠతో సాగింది మేచ్. వయసులో చిన్నవాడైనా అరవింద్ మెరుపులాంటి కదలికలతో షాట్స్‌తో రాంబాబుని అప్పుడప్పుడూ ఇబ్బంది పెట్టాడు. చెరో గేమ్ గెలిచాక ఆటని ఆపేశాను. నా నిర్ణయాన్ని అందరూ హర్షించారు. అరవింద్, రాంబాబులని స్వయంగా అభినందించాను. నేనే కాదు అందరూ అభినందించారు.

మేనేజరు ముకుందన్ దంపతుల మొహాల్లో వెలుగులు. కమ్యూనిటీ సెంటర్ తరపున నేను కొన్న జ్ఞాపికల్ని శ్రీమతి ముకుందన్‌గారు ఇద్దరు క్రీడాకారులకు, అంపైర్‌కు అందజేశారు. వచ్చిన వాళ్ళందరికీ అల్పాహార విందుగా బిస్కెట్లు, తేనీరు ఇవ్వడంతో ఆనాటి కార్యక్రమం ముగిసింది.

"ధన్యవాదాలు సారథిగారూ" వెళ్ళిపోతూ ముకుందన్‌గారూ, ఆయన శ్రీమతి అన్నారు. వారి సహృదయతకి మరోమారు మనసులో వారిని అభినందించుకున్నాను.

-ప్రేమేంద్ర (విశాఖపట్నం)

## సంక్రాంతి కథల పోటీ

సంక్రాంతి పండగ సందర్భంగా 'పులికంటి సాహితీ సత్కృతి' కథలపోటీ నిర్వహిస్తున్నది.

- ★ ఈ పోటీలో వయోపరిమితితో నిమిత్తం లేకుండా ఎవరైనా పాల్గొనవచ్చును.
- ★ కథ 12 అరఠావులకు మించకుండా ఉండాలి.
- ★ ఇతివృత్తం ఏదైనా కావచ్చు. కానీ సామాజిక ప్రయోజనం విధిగా దృష్టిలో పెట్టుకోవాలి.
- ★ బహుమతుల నిర్ణయంలో సాహితీ సత్కృతి కార్యవర్గ నిర్ణయమే తుది నిర్ణయం. దీని మీద ఉత్తరప్రత్యుత్తరాలకు తావులేదు.
- ★ పోటీలో బహుమతులు అందుకున్న ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి కథలతో మరికొన్ని ఉత్తమ కథలు కలిపి సాహితీ సత్కృతి సంపుటీకరించే ప్రయత్నం చేస్తుంది.
- ★ 2004 జనవరి నెలలో తిరుపతిలో నిర్వహించే సాహితీ సభలో బహుమతి విజేతలను సముచితరీతిని సత్కరించి జ్ఞాపికలతోపాటు బహుమతి మొత్తాన్ని అందజేస్తుందని సత్కృతి అధ్యక్షులు పులికంటి కృష్ణారెడ్డి తెలియచేశారు.

మొదటి బహుమతి - రు.3000/-, రెండవ బహుమతి - రు.2500/-, మూడవ బహుమతి - రు.1500/-

**పోటీ కథలు- పులికంటి సాహితీ సత్కృతి, 467, బండ్ల స్ట్రీట్, తిరుపతి-517 501 అనే చిరునామాకి 20.12.2003 లోగా అందాలి.**